ప్రియురాలు కోసం యుగాలైనా ఎదురు చూడొచ్చు కానీ మనక్కావలసిన బస్సుకోసం అరగంట వెయిట్ చేయాలంటే మహాకష్టంగా ఉంటుంది.

అయినా బస్సూ, ప్రియురాలు ఒకటా? నా పిచ్చికాకపోతే!

''ఈ రాత్రి నువ్వు వరంగల్ వెళ్లి వెలగబెట్టాల్సిన రాచకార్యాలేమున్నాయిరా? ఈ రాత్రికి ఇక్కడే ఉండి, రేప్పొద్దున వెళ్లి పోదువుగానీ'' చిలక్కిచెప్పినట్టు చెప్పాడు బాబాయ్ - పైగా అనుమానంగా కూడా చూశాడు.

''ఊహూహూ.... నేను వెళ్లాలి.... నాకు పనుంది... ఏమనుకోకండి, బాబాయ్...'' అంటూ బ్యాగ్ భుజాన వేసుకుని వచ్చేశాను. వెనక్కు పిలుస్తాడేమోనని గబగబ బయటికొచ్చి గేటు మూసి -''తాళం వేసుకో బాబాయ్'' అని లోపలికి కేకేసి రోడ్డు మీదకు పరుగెత్తాను.

# నీలికళ్లి

## కోటపల్లి ఈశ్వర్



పదకొండు గంటల నుంచీ రెండు బస్సులు పోయాయి. రెండింటిలోనూ కాలు పెట్టడానికి చోటు లేదు. కరీంనగర్ నుండి వరంగల్ చేరడానికి రెండు గంటలు పడుతుంది. అంతసేపూ బస్సులో కమ్మీకి వేలాడుతూ వెళ్లడమంటే నరకయాతనే అనిపించి ఊరుకున్నాను

ఇప్పుడు పన్నెండు కావస్తోంది. ఇంక ఒకే ఒక్క బస్సు మిగిలి వుంది రావడానికి. ఇది వదులుకుంటే అంతే సంగతులు. తిరిగి బాబాయ్ ఇంటికి వెళ్లాలంటే యాభై రూపాయలు అర్పించుకోవాలి ఆటోకి. ఎందుకులే తలనొప్పి! ఎంతకష్టంగా వున్నా, ఈ లాస్ట్ బస్‌లోనే వెళ్లి పోవాలి అనుకుంటూ వుండగా... నా తపస్సు ఫలించి ప్రత్యక్ష మైంది నా లాస్ట్ బస్సు...

ఈకొస నుండీ, ఆకొస దాకా సందులేకుండా జనంతో, నిండు గర్భిణిలా భారంగా కదులుతూ, పాయింట్ వద్దకు వచ్చి ఆగిన బస్సును చూసి నేను భారంగా నిట్టూర్చి, మరింత నీరసంగా కదిలాను ఫుట్‌బోర్డు వైపు.

దిగే వాళ్లు నలుగురూ, ఎక్కేవాళ్లు పన్నెండు మందీనూ!

కాళ్లను ఫ్లోర్‌కి పాతేసుకుని, కమ్మీలకూ, కిటికీలకూ, సీట్లకూ చేతుల్ని బలంగా బిగించి, ఈ స్థలం నాది. హరిహరాదులు దిగివచ్చినా అణువంతైనా నన్ను కదిలించిలేరన్నట్టుగా రాతి విగ్రహాల్లా నిలబడ్డారు ఎవరికి వారు.

చలనం లేని వాళ్లతో మాట్లాడటం వృథా అని తెలుసుకాబట్టి - ధాన్యం బస్తాల మధ్య నుండి నడిచినట్టుగా వారిని ఢీకొంటూ, జరుపుతూ, సందుల్లో నుండి ఒక్కొక్క పార్టుని ఇరికించి ముందుకు కదులుతూ సణుగుళ్లూ, గొణుగుళ్లూ మధ్య కొంతదూరం వరకూ ప్రయాణం చేయగలిగాను. అయిదు నిముషాల వ్యవధిలో.

దాదాపు బస్సు మధ్యభాగం కన్నా మరి కాస్త లోపలి దాకా రాగలిగినందుకు గర్వంగా వుంది. సాహసం వీడిపోని వీరుడిలాగా వున్న నన్ను నేను అభినందించుకున్నాను.

కానీ ఇప్పుడు కళ్లెదురుగా జనమే కానీ కిటికీ అనేదే కనిపించడం లేదు. చలికాలం బిగినైంది కాబట్టి సరిపోయిందిగానీ - లేకపోతే లోన ఉక్కకి ఉక్కిరిబిక్కిరై ఊపిరాడక చచ్చుండే వాడిని.

కొద్ది నిముషాల తర్వాత కమ్మీకి బలంగా తగిలి ఉన్న రెండు విడివిడి వ్యక్తుల చేతుల మధ్య కొద్దిగా ఖాళీని క్రియేట్ చేసుకోగలిగాను కొద్ది కష్టం మీద. ఇప్పుడు ఇందాకటి కన్నా చక్కగా గాలి ఆడుతోంది.

బస్సు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్న సమయంలో మరికొంతమంది ఎక్కారు బస్సులోకి. హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చినందువల్ల రొప్పుతున్నారు. వాళ్లందర్నీ తొందరచేస్తూ ధన్‌మని డోర్ వేసి రైట్ చెప్పాడు కండక్టరు.

బస్సు మెల్లగా కదిలింది. మనుషుల మధ్య నుండి చల్లనిగాలి మెల్లగా తాకింది నన్ను. కొంచెం రిలీఫ్‌గా అనిపించింది.

అంతలో వెనకగా గాజుల శబ్దం వినిపించినట్లయ్ - చప్పున తలతిప్పి చూశాను.

అంతే! ఆపాదమస్తకం పులకింతతో ఝల్లుమంది నా శరీరం.

వెనకాలే ఒక సౌందర్యరాశి.

నారింజ రంగుపై తెలుపూ, నలుపూ పూల ప్రింటెడ్ శారీపై నలుపు రంగు పొట్టిచేతుల జాకెట్.


మనిషి సరిగ్గా నా అంత ఎత్తు ఉంది. నుదుట చిన్నగా ఎర్రని బొట్టు, నుదుటిపై సైడ్‌గా వాలిపోతున్న పాయల వంటి నల్లని కేశాలు, వత్తైన జడలో కనకాంబరాలు తురిమినట్టు భుజం మీదుగా కనిపిస్తోంది. తెల్లటిచేతికి నల్లని గాజులు, మెడలో సన్నని చెయిన్, ఒక చేతికి స్క్వేయిర్ డయల్‌వాచీ, అరచేతులకి గోరింటాకు, గోళ్లకి ఎర్రని నెయిల్ పాలిష్... ఇవన్నీ ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్న అంశాలు. సింపుల్‌గా ఉన్నట్టు అనిపిస్తున్నా అలంకరణ అద్భుతంగా ఉంది.

నాకు ఉన్నట్టుండి 'చింతామణి' డ్రామాలోని ''కురులవిరిదండ... కనుల కాటుక... సకల అలంకరణలు లేక... స్త్రీ అందంగా ఎలా ఉంటుంది..' అనే బిట్టు గుర్తుకొచ్చింది.

అందం ఆడవారి సొత్తు.... అనే బిళ్వ మంగళుడు కూడా గుర్తుకొచ్చాడు... సన్నగా నవ్వుకున్నాను. పాయింట్‌లో కొద్దాం! నా అదృష్టానికి ఎంతగానో మురిసిపోయాను. కష్టపడితే సుఖం దొరక్క తప్పదంటారు. ఇంతసేపూ... రెండు బస్సుల నొదులుకుని మరీ ఎదురుచూసినందుకు ఈ బహుమతి లభించింది.

పడ్డ శ్రమంతా మరచిపోయినట్లయింది. మనసు ఎందుకనో ఆహ్లాదకరంగా మారిపోయింది. ఎందుకనో ఏమిటి - కారణం ఉందిగా... ఈ జగమంతా అందాలమయం!!

ఇంత సొగసుగున్న ముద్దుగుమ్మ పేరేమిటో సౌందర్యం, అందాల అంజలి, పరిమళ, వాసంతి, కీర్తిప్రియ, ప్రియంవద, ఛ... ఇవేవీ అయి ఉండవు... ఆ కళ్లు భానుప్రియ కళ్లులా ఎంత మనోహరంగా ఉన్నాయ్. అటు ఇటు తిప్పుతున్నప్పుడు స్వర్ణకమలం సినిమా స్ఫురణ కొస్తోంది. సులోచన అయి ఉంటుంది.. ఛీ... పాతపేరు... మీనాక్షి... అందరూ...



మీనా.. మీనా అని పిలుస్తారు కాబోలు... మీనా... బాగుంది..

కానీ, అంతచీకట్లోనే మెరుపుతీగలా కనిపిస్తోంది. విద్యుల్లత అయి వుంటుందా? పంకజం అనే పేరా? ముదురుగా ఉంది పేరు.

ఎందుకీగొడవంతా... ఆమె ఆకర్షణంతా ఆ కనకాంబరాల్లో ఉంది కాబట్టి... 'కనకాంబరం' అని వుంటుందేమో... కనకం... అని పిలుచు కుంటున్నేను. ఏదో పాత సినిమాలోలాగుంది. రమణారెడ్డి, సంధ్యని... కనకం... కనకం... అని పిలుస్తుంటాడు.. నేను రమణారెడ్డినా? ఏం కాదు... చక్కగా బాగానే ఉంటాను. నన్నందరూ 'హాయ్ హాండ్సమ్' అంటుంటారు.

ఆవిడనే గమనిస్తున్నాను.

ఇంకా అడ్జస్ట్ కాలేదు తను. అదృష్టవశాత్తూ అటు ఇద్దరు స్త్రీలు, ఇటు ఇద్దరు వయసుపైబడ్డ మగవాళ్లూ, ఆ స్త్రీలకూ నాకూ నడుమ ఇద్దరు పది పన్నెండేళ్ల అబ్బాయిలూ....! మధ్యలో తను... అదీ అక్కడి పరిస్థితి.... నా ముందు. నా కుడిపక్కగా ఉన్న జనంతో నాకు పనిలేదు కదా!




జనం ఒత్తిడి నడుమ ఒక కన్వీనియంట్ పొజిషన్‌లోని రావడానికి ప్రయత్నిస్తూ చుట్టూ చూస్తోంది ఆమె. కొద్దిగా జరిగి తన ఎడమచేతిని నా ముందున్న సీటుపై రాడ్ వద్దకు జరిపి కొద్దిపాటి ప్రయత్నంతో ఆ రాడ్‌ని పట్టుకో గలిగింది. ఆ పైన అదే భుజానికి వేలాడుతున్న వ్యానిటీ బ్యాగ్‌ని కుడిచేత్తో ముందుకు లాక్కొని, అదే చేత్తో పైనున్న రాడ్‌ని అందుకుంది.

ఇప్పుడు సరిగ్గా తను నావీపు వెనకాలే ఉంది.

ఇద్దరి మధ్యా దూరం కరక్ట్‌గా కొలిస్తే - రెండు అంగుళాలు!

బస్సు చిన్నగా వేగం అందుకుంది... కండక్టర్ టిక్కెట్లు కొడుతూ ముందుకు వస్తున్నాడు... జనాన్ని తోసుకుంటూ!

నా మనసునంతా అప్పటికే ఆమె ఆక్రమించేసింది. ఆవిడ గురించిన ఊహలు నన్ను ఎక్కడికెక్కడికో తీసుకుని పోతున్నాయ్... ఆనందంతో హృదయం ఊయలలూగుతోంది.

కాలం బస్సుతో పాటు వేగంగా పరుగెత్తుతున్నట్లనిపించింది. బస్సన్నా ఆగుతుంది... కాలం ఆగుతుందా? అబ్బో... మధ్య మధ్యలో వేదాంతం..

పది నిముషాల అనంతరం కండక్టర్ చిటికెలు వినిపించి పక్కకి చూశాను. సరిగ్గా కనకం (నేను పెట్టుకున్న ముద్దుపేరు) పక్కకి వచ్చాడో లేదో, లాఘవంగా వెనక్కి జరిగి బేగ్‌లో నుండి, డబ్బులు తీస్తూ.... "హన్మకొండ.... ఒకటి... అంది.. స్వరం కూడా మధురమే...

టికెట్ పంచ్‌చేసి చిల్లర వెనకాల పెన్సిల్‌తో రాస్తున్నాడతను. నేనూ డబ్బు తీసి అతనికిచ్చి టిక్కెట్ తీసుకున్నాక... "టికెట్ ... టికెట్..." అని అరచి వెనకాల ఎవరూ కొత్తవారు చేరలేదని గ్రహించి తిరిగి ముందుకు దారి చేసుకుంటూ వెళ్ళిపోయాడు కండక్టర్. ముఖాలవంక పరిశీలనగా చూస్తూ!

తనుకూడా నాతోపాటు దాదాపు చివరిదాకా ఈ బస్సులో ఉండబోతోందని తెలిసి మనసు పరవళ్లు తొక్కుతోంది... చిలిపి ఆశలు అప్పుడే నా ఎదలో సవ్వడీ చేయడం మొదలు పెట్టాయ్... అవి పుట్టాలే గానీ.. ఎదగడం ఎంతసేపు!

హన్మకొండలో ఎక్కడికో... ఫ్రెండింటికా? బంధువులెవరైనా ఉన్నారా? అసలు ఈమెదీ హన్మకొండనే? ఎప్పుడూ కనిపించలేదే? అయినా హన్మకొండని నేనేమన్నా గుత్తకి తీసుకున్నానా ఏమిటి? నా పిచ్చికాకపోతే...

కానీ, హన్మకొండలో మా అక్కయ్య, బావగారు ఉన్నారు. ఆయన జువారి సిమెంట్‌లో ఉద్యోగం. పేరు. మైనంపాటి నారాయణరావు. హంటర్ రోడ్‌లో మేడ మీద కాపురం ఉంటున్నారు. నేను తరచూ వాళ్లింటికి వెళ్లొస్తుంటాను.

ఈవిడని ఎప్పుడూ చూడలేదు ఆ ఏరియాలో కూడా! మరి ఏ ఏరియానో... ఎలా తెలుస్తుంది?

మరో అయిదు నిముషాల తర్వాత... పంచ్ మెషిన్‌తో టిక్‌టిక్ అని పోల్‌పై చప్పుడు చేశాడు కండక్టర్. బస్సులో లైట్లన్నీ ఆఫ్ చేసి స్పీడ్‌ని పెంచాడు డ్రైవర్.

బస్సు కుదుపులకు ఆవిడ, నాకు మరింత దగ్గరగా వస్తూ, దూరంగా జరుగుతూ ఉంది. దగ్గరగా వచ్చినప్పుడల్లా ఆమె మెత్తని శరీర స్పర్శ నా వీపుకి తగిలి నాలో గిలిగింతల్ని, పులకరింతల్ని రేపుతోంది.

అంతలో రెండు సీట్ల అవతల... తన సీటు పక్కగా నిలబడి తనపై వాలిపోతున్న భారీకాయాన్ని తోసేస్తూ... ఒకావిడ గట్టిగా అరిచింది... "ఏయ్... కళ్లు కనిపించడం లేదా... ఇక్కడ మనిషి ఉంది... పైన పడుతున్నావ్.... ఛట్... జరుగు పక్కకి... జరగవయ్యా... ఏమారితే పైన పడి నిదరపోయేట్టన్నాడు...

వెంటనే భారీకాయం ఏం మాట్లాడకుండా చిరాగ్గా నలుగుర్ని వెనక్కి తోస్తూ, తనూ వెనక్కి అడుగువేసింది. దాంతో సుమారు పదిమంది వరకూ తాము ఆక్రమించుకొన్న స్థానాల నుండి పక్కలకీ, వెనక్కీ జరగవలసి వచ్చింది.

నా అదృష్టం తలుపు తట్టింది. ఈ గలభా కారణంగా నా కనకం (అవును... ప్రస్తుతం నా ఊహల సామ్రాజ్యాధినేత కనకమే కదా!) పూర్తిగా నా వెనక్కి వచ్చేసి, నన్ను అతుక్కుపోతున్నట్లుగా నిలబడిపోయింది.

బస్సు చీకటిని చీలుస్తూ ముందుకు దూసుకుపోతూ వుంటే... అల్లరి కోరికలతో నా గుండెలో ఏదో తెలీని అలజడి... మరింతగా పెట్రేగి పోతోంది. నన్ను సలుపుతోంది.

అంతా నిద్రమత్తులో జోగుతున్నారు. ఈ చిక్కని చీకటిలో ఏం జరిగినా ఎవ్వరికీ తెలిసే అవకాశం లేదు.

అంతలో ఉన్నట్టుండి ఒక కుదుపు..

కనకం ఎత్తయిన ఎదబలంగా నన్ను హత్తుకుంది.

ఒళ్లంతా ఆవిడ చీర తగిలి నరాల్లో విద్యుత్ పాకినట్టయ్యింది. ఇంతకన్నా గొప్ప అవకాశం వేరే రాదు గాక రాదు...

గుండె వేగంగా కొట్టుకుంటుంటే... ఏమైతే అదే అవుతుంది లెమ్మని... కొద్దిగా వెనక్కిజరిగి నా కుడిచేతిని అలా అలా కదిలించాను. రెండు క్షణాల్లో చేతికి అందింది. ఆమె సన్నని నడుము... చపాతీ పిండిలా మెత్తగా ఉంది.

అంతలోనే లోలోపల ఒక భయం... నేను చేస్తున్న అల్లరి (ఇది అల్లరా? కాదు... ఆగడం, అరాచకం, అకృత్యం... సింగినాదం జీలకర్ర....) సహించలేక ఆవిడ అరిచిగోల చేస్తే... ఇంకేమైనా ఉందా? చావగొట్టి బస్సులో నుంచి తోసి పారేస్తారు. ఈ జనమంతా కలిసి.... పరువు, మర్యాద మంట కలిసిపోవూ.... తెలిసిన వాళ్లెవరయినా ఉన్నారంటే ఇంకా ప్రమాదం.

ఈ ఆలోచనరాగానే చేయి వణికింది. కానీ అంతలోనే నరాలు జివ్వుమన్నాయ్. కనకం చేస్తున్న పనికి!

నమ్మలేకుండా ఉన్నాను.

ఇది... ఇది... నిజమేనా? ఆశ్చర్యంలోంచి కొద్దిగా తేరుకుని మెల్లగా తలతిప్పి వెనక్కి చూశాను.

ఆవిడ నడుము దగ్గరగా తచ్చాడుతున్న నా చేయిపై ఆమె చేయి... మెత్తగా, వేడిగా... వేళ్లలో వేళ్లు కలుపుతూ!

అంటే... తనకిష్టమేనన్నమాట... నిజమేలే! కొందరు స్త్రీలు అలా పైకి నిప్పులా కనిపిస్తారే గానీ... అవకాశం దొరికితే ఇలాంటి చిన్నచిన్న టారింగ్‌లని తామూ వదులుకోవాలనుకోరు.

ఆ సందర్భంలో కూడా నాకు నా ఫ్రెండు, ప్రముఖ

కవిత

## సమాంతర రేఖలపై...

మన కాల్పనిక లోకాల
పురాణ పురుషుల మృత్యఛాయలలో
దైవికం-పాశవికం-దానవలీలల రచన
ఆ క్షణాన ఎవడి అదుపూ ఉండదు
మనిషిలోని మృగం రెచ్చిపోతుంది
ఒక దేవుడు మరో దేవుడిపై
యుద్ధం ప్రకటిస్తాడు
ఎక్కడో దాగిన 'సూపర్ ఎనర్జీ'
విశ్వరూపం దాల్చి
సూపర్‌మ్యాన్ అవతారమై
మనందరిని రక్షిస్తాడనే భ్రమ
ఒక నిరంతర ఘోష
దీనహీన నిస్సహాయ రోదనల మధ్య
సర్వసౌఖ్యాలు అనుభవిస్తూ
అనుగ్రహ భాషణం పేరిట
తాయెత్తులు పంచుతూ
పవిత్ర గ్రంథాల సాక్షిగా
ప్రాచీన భాషల్లో సూక్తులు వల్లిస్తూ
టీకా తాత్పర్యాలను
ముగ్ధమనోహరంగా బోధిస్తూ
సమాంతర ప్రపంచంలో జీవిస్తున్న వాళ్లు
శ్రమను కబళిస్తున్న పరాన్నభుక్కులు

-నిఖిలేశ్వర్
91778 81201

క్రిమినల్ లాయర్. నా వూరు శ్రీధరనాయుడు గుర్తుకొచ్చాడు. వాడనేవాడు కదా... 'అవకాశం రాక కొంత మంది మంచివాళ్లుగా చెలామణి అవుతున్నారు. కొంత మంది చాలామంచి వాళ్లుగా ఉండి కూడా అవకాశం అందివచ్చిందని చెడ్డవాళ్లుగా మారిపోతున్నారు... ఇప్పుడు నేను రెండవ కోవకి చెందుతాను!

కనకం నా చేతిని గట్టిగా పట్టుకోవడం నాకు విభ్రమంగా వుంది. కోరిక, వేడి, వలపు... ఒక్క మగాడి నేనా? ఆడదానికి మాత్రం సరదాలూ, సరసాలూ, ఆవేశాలూ ఉండవా? ఎంతైనా ఆమెదీ రక్తమాంసాలున్న శరీరమే కదా!

అంతా సహజమే అని అనుకోవడంతో నాలో ఎక్కడలేని ధైర్యం, సాహసమూ వచ్చి చేరాయ్!

కనకం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనే ఇచ్చింది. ఇంకా కాలాయాపన ఎందుకు? అప్పుడే గంట గడిచింది. గమ్యం చేరిపోయేలోగా నా గమ్యం నేను చేరుకోవాలి....

మెల్లగా ఆమె చేతిని విడిపించుకొని... మరింత వెనక్కి జరిగి... ఆమె నడుము దగ్గర ఆబగా తడుముతూ... చేతిని అలా అలా ఆమె వెనకభాగం వైపు జరిపి... సుతారంగా ఒక్క నొక్కు నొక్కాను.

ఆ తాకిడికి ఆమె ఒళ్లు జలదరించిందన్న సంగతిని నేను గమనించక పోలేదు. గర్వంగా నవ్వుకున్నాను. బస్సు ఆగకుండా పరుగులు తీస్తూనే వుంది.

అంతా సవ్యంగా జరిగిపోతుండడంతో మరింత చొరవచేసి, వేడి ఊపిరులు వదులుతూ... ఆమె వైపు తిరిగి, మెల్లగా తలవంచి ఆమె మెడపై ముద్దు పెట్టుకోబోతుండగా... చప్పున పక్కకి జరిగింది కనకం!

ఖిన్నుడనయ్యాను.... ఏమిటీవిడ ఉద్దేశ్యం? ఆలోచనల్లో పడి కొన్ని క్షణాలు అలాగే ఉండిపోయాను మౌనంగా!

వ్యవహారం శృతిమించరాదని ఆవిడ చెప్పకనే చెబుతోందా? అంతొద్దు... అని ఆంక్షలా!

ఏమో... ఎందుకులే... అనుకుంటుండగా మళ్లీ కనకం చేయి... మెల్లగా నా నడుముని, వీపుని తడుముతూ...

ఆ స్పర్శకి కసుక్కున వెనక్కి తిరిగి ఆ చేతిని కొరికేయాలన్నంత టెన్షన్ కలిగింది. గుటకలు మింగాను గుంభనంగా!

ఆమె చెయ్యి అలా తచ్చాడుతూనే ఉంది. ఆనంద డోలికల్లో, అమర లోకాల్లో విహరిస్తున్నాను నేను!

అలా మరో ఐదు నిముషాలు ఆమె చేతులతో నా శరీరంపై ఏదో మాయాజాలం చేస్తూనే వుంటే... అదో రకం మత్తులో మునిగి, పారవశ్యంలో తేలిపోతున్నాను నేను...

అంతలోనే ఈ తీయని చీకటి ఆటకి అంతరాయం కలిగిస్తూ.. బస్సులో లైట్లు వెలిగాయ్!

తేలుకుట్టిన దొంగల్లా ఏమీ తెలియనట్లుగా, ఏమీ జరగనట్లుగా ... ఎవరి పొజిషన్ల వాళ్లం సర్దుకున్నాం...

రసకందాయంలో పడ్డ వయసువేడి కథకి బ్రేకులు వేసిన బస్సు డ్రైవర్‌పై చెప్పలేని కోపం వచ్చింది. స్పూన్‌తో నోటిలో వేసుకోబోతున్న గులాబ్ జామ్‌ని బలంగా విసిరి పడేసినట్లుగా గిలగిలలాడిపోతోంది నా మనసు. బస్సు నాలుగు వంకరలు తిరిగి కీచుమంటూ ఆగింది.

'హుజూరాబాద్' అని అరిచాడు కండక్టర్. అసహనంతో బయటకు చూస్తూ ఇక్కడ స్టేజీ పెట్టిన ఆర్టీసీ వారిని తిట్టుకుంటున్న నాకు రెండు నిముషాల్లోనే బస్ మళ్లీ కదలడం ఎంతో ఆనందాన్నిచ్చింది.

నిముషం తర్వాత మెల్లగా వెనక్కి తిరిగి చూశాను. కనకం కోసం.. నివ్వెరపోయాను.

ఆవిడ అక్కడ లేదు. గాభరాగా అటూఇటూ చూశాను. రెండు సీట్లవతల సీటులో కిటికీ పక్కన కూర్చుని ఉంది. అంటే... ఆ సీటులోని వ్యక్తులెవరో ఇంతకుముందు దిగిపోయి ఉండాలి.

మంచి ఛాన్సు.... మరో అరగంట తృప్తిగా ఆ అనుభవాన్ని పొందుదామనుకున్న నా ఆశలపై నీళ్లు చల్లినట్లయిపోయింది.

గాలి తీసిన బెలూన్‌లో డీలా పడిపోయాను. కాలుతున్న కొలిమిలో బక్కెట్ నీళ్లు పోసినట్లయింది. నా పరిస్థితి... ఎక్కడ నరాలక్కడ చల్లబడిపోయాయ్.


చేసేదేముంది! కనీసం ఆవిడ పక్కన కూర్చుని... మళ్లీ లైట్లు ఆఫ్ చేయగానే కథ మొదలెడదామనుకుంటే... ఆల్ రెడీ ఎవరో వచ్చి అక్కడ సెటిలైపోయాడు... లక్కీగయ్... ఇప్పుడిక ఎంజాయ్ చేయడం వాడివంతేమో! పోనీలే.

అందిన ప్రతిసుఖమూ శాశ్వతం కాదుకదా... అలా అనుకుని సరిపెట్టుకుని. కనకం పక్కన

## మనమీదేనర్రోయ్!

సరసి





కూర్చున్న ఆ గొట్టంగాడికేసి తేరిపార చూశాను.... ఒక మాదిరిగా ఉన్నాడు. ఒక చెవికి కమ్మ పెట్టుకుని స్టైలిష్‌గా ఉన్నాడు... కనకం వైపు అసలు చూసిన ట్లుగా లేదు... తన ధోరణిలో తనున్నట్లు – ఒడిలో పెట్టుకున్న బ్యాగ్‌లో ఏదో కలబెట్టుకుంటున్నాడు

దున్నపోతు ముఖం గాడు... ఎంత బుద్ధిమంతు డులాగా కూర్చున్నాడో చూడు... కంత్రీగాడిలాగే ఉన్నాడు. లైట్లు ఆఫ్ అయ్యాక కదా... వాడిలోని కామ పిశాశం బయటికొచ్చేది...

చల్లని గాలి రివ్వున కొడుతుంటే కళ్ళ మీదకి నిద్రా దేవి వచ్చి నాట్యం చేయసాగింది. కమ్మీ పట్టుకుని అలాగే రెండు నిముషాలు, కుడిచేతి భుజం మీద తల ఆన్చి జోగాను. ఊహూం.... ఏమరుపాటుగా ఉంటే బొక్క బోర్లా పడేలాగా వున్నాను. తమాయించుకుని కళ్లు నాలుగుసార్లు టపటప ఆర్పి నిద్రపోగొట్టడానికి ప్రయత్నించాను. పోదే!!

ఆ చీకట్లోనే కనకం వైపు చూశాను. కిటికీకి తల ఆన్చి కళ్లు మూసుకుని వుంది.. ప్చ్... ఇవతల గనక ఆ ఎలుగుబంటి మొహం వాడి బదులు నేను ఉండి ఉంటే – 'నా భుజం మీద పడుకో కనకం' అని అననూ! ఛ. మిస్సయ్యానే!!

ఈ నిద్ర నెలా జయించటం? అదిగో... మళ్లీ మెల్లగా కళ్లమీదకు వచ్చేస్తోంది.... అసలు పోతేగా... అది మళ్లీ రావటానికి... ఇలా కాదు.. కనకం గురించి ఊహిస్తూ ఉన్నాననుకో... నిద్ర ఎగిరిపోతుంది....

అలా అనుకుంటూ... మెల్లగా కళ్లు మూసీ, తెరిచీ.... ఉలిక్కి పడ్డాను... హన్మకొండకి దగ్గర్లో ఉంది బస్సు.

వరంగల్ దాకా వెళ్లి వెనక్కిరావడం కన్నా, ఇక్కడ దిగి ఆటోలో వెళ్లి పోవడమే మంచిదనుకుంటూ – భుజానికున్న బ్యాగ్‌ని సరిచేసుకుని లేచి నిలబడ్డాను.

బస్సు హన్మకొండలో స్థిమితంగా ఆగింది. నిలబడి ఉన్న జనం ముందు దిగుతున్నారు... ఈలోగా నేను కనకంనే చూస్తూ ఆవిడ ఉన్న సీటుదాకా వచ్చాను.

ఆవిడ మొహం లైట్ల వెలుగులో స్పష్టంగా కనిపి స్తోంది.

నేనే గిల్టీగా ఫీలయ్యి ఆవిడవైపు చూడలేక ముందుకు సాగబోతుండగా... నన్ను ఎవరో చేయి పట్టి లాగినట్లనిపించి టక్కున ఆగి వెనక్కి తిరిగి చూస్తే...

భరత్! డిగ్రీలో నా క్లాస్‌మేట్!

వాడిని చూడగానే ముందుగా గుర్తొకొచ్చేది నా యాక్సిడెంటే అవును. ఓసారి సైకిల్‌పై కాలేజీకి వస్తుం డగా – ఎవరో రౌడీ వెధవలు స్కూటర్‌పై వెళుతూ – నాకు డ్యాష్ ఇచ్చారు. నేను ఫుట్‌పాత్ మీద పడ్డాను. నుదుటికి బలంగా గాయం తగిలింది. దాదాపుగా కోమా స్టేజీలోకి వెళ్లి వుండేవాడినే. రక్తం చాలాపో యింది. వీడే... ఈ భరత్తే.... హాస్పిటల్‌కి తీసుకెళ్లి అప్ప టికప్పుడు డబ్బు కట్టవలసి వుంటే... చెయినూ, ఉంగ రమూ కుదవపెట్టి, పదిహేను రోజులు నా పక్కనే వుండి – మా అమ్మా నాన్నా ఉన్నా కూడా సపర్యలు చేశాడు. స్నేహధర్మం పరిపూర్ణంగా నెరవేర్చాడు. నేను బతికి బట్టకట్ట గలిగి, ఇప్పుడీ పొజిషన్‌లో వున్నానంటే – ఇదంతా భరత్ చలవ – భరత్ పుణ్యం.

నా కళ్లలో నీళ్లు చివ్వున చిమ్మాయ్. ఆపుకునే ప్రయత్నం కూడా చేయ లేదు. అలాగే నిలుచున్నాను. వెనకవాళ్లు ''ఊ.... కదలండి..'' అనేసరికి ఈ లోకం లోకి వచ్చాను. భరత్‌తో చేయి కలిపాను... హాయిగా నవ్వాను... ముందు గబగబ బస్ దిగాం.

''నీకు యాక్సిడెంట్ గుర్తుకొచ్చిందా?'' అన్నాడు భరత్.

అవునన్నట్టు తలూపాను.

''అసలు నువ్ మర్చిపోతేగా...'' అని ''ఆ కళ్లలో నీళ్లు తుడుచుకో.. ఎవరన్నా చూస్తే బాగోదు..'' అన్నాడు కర్చీఫ్ ఇస్తూ...

ఇంతలో కనకం బస్ దిగి భరత్ ప్రక్కనే వచ్చి నిలుచుంది. ఆశ్చర్యపోవటం నావంతయింది.

''అవున్రా! నువ్వూ ఇదే బస్సులో వస్తున్నా – చూళ్లేదే... నువ్వెక్కడ ఎక్కావ్?'' అడిగాడు భరత్.

''కరీంనగర్''.

''ఇదిగో – నా మిసెస్ కూడా అక్కడినుంచే వస్తోంది. నేను ఓ పని మీద హుజూరాబాద్‌కి వెళ్లాను. నేను అక్కడ ఎక్కాను బస్సు.... ఎక్కడా... విపరీ తంగా రద్దీ... చివరల్లో ఉండిపోయాను... నా మిసెస్... మధ్యలో ఉండింది'' అడుక్కుండానే వివ రాలు చెపుతున్న భరత్ వైపు చూడలేక పోయాను.

నాలో నేను కుంచించుకుపోతూ మొహం తిప్పుకు న్నాను.

''అరె... ఇంకా నువ్ ఆ యాక్సిడెంట్‌లోనే ఉన్నావా... ఛ... ఫ్రీగా ఉండరా... ఏదో జరిగిపో యింది.. అప్పటిదాకా మనమధ్య మామూలు స్నేహం ఉండింది.

మధ్యలో ఆపి ''నా ప్రాణం నిలబెట్టావ్ కాబట్టి ప్రాణస్నేహితులయ్యాం..'' అన్నాను కృతజ్ఞత నిండిన కళ్లతో...

''ఆc... ఏం కాదు.. అంత ప్రాణస్నేహితులమే అయి వుంటే ఇన్నేళ్లూ కలవకుండా ఉంటామా?'' నిష్ఠూరమాడాడు.

''లేదు... భరత్... నేను ఊర్లో సరిగాలేను... కొద్ది రోజులు హైదరాబాద్ నారాయణ కోచింగ్ సెంట ర్‌లో లెక్చరర్‌గా చేశాను... వాళ్లే ట్రాన్స్‌ఫర్ చేసి నెల్లూరుకి వేశారు. అక్కడే ఎక్కువ సంవత్సరాలు పని చేశాను..''

''సరే... అర్ధరాత్రి మద్దెల సేవ... అన్నట్లు.. ఇదిగో నా అడ్రస్సు.. ఆదివారం నువ్వు తప్పక రావాలి...'' అంటూ నాకు మరీ మరీ చెప్పి – ఆటోలో వెళ్లిపోయా రిద్దరూ!

నాకు ఒళ్లంతా నొప్పులుగా ఎవరో సుత్తితో తల మీద బాదుతున్నట్టుగా, పెద్దగాడి పొయ్యి మీద బాణిలి పెట్టి, నూనెపోసి బాగా కాగాక – అందులో నన్ను వేస్తున్నట్లుగా ఉంది.

గట్టిగా తలవిదిలించాను.. నీరసంగా ఓ బల్లమీద కూర్చున్నాను. గుండెని ఎవరో పిండుతున్నారు.

ఇంతసేపూ ఓ ప్రాణ స్నేహితుడి భార్యతోనూ, తను అలా నీచంగా, హేయంగా బిహేవ్ చేసింది!

ఛ... ఛీ... ఏమైపోయింది నా సభ్యత! నా సంస్కారం ఏ తుంగలో తొక్కబడింది! ఇంతకన్నా పాపం మరొకటి ఉందా?

ఈ సంగతి ఆవిడ భరత్‌కి చెబితే – తనని క్షమిం చగలడా? ఈ జన్మలో తను భరత్‌కి ముఖం చూపిం చగలదా?

కానీ, అంతలోనే మరో ఆలోచన... తను చేసింది తప్పే! కానీ ఆవిడ?! ఆవిడ కూడ తనతో... ఆ అనాగ రికంలో పాలు పంచుకోలేదూ! పాపం కాదూ!

తన ఆలోచన ఎంత తెలివిలేనిది! తనను తాను సమర్ధించుకోవటానికి అనుకున్నట్లుగా ఉంది.

మగవాడు చేస్తే తప్పుకానిది – స్త్రీ చేస్తే పాప మైంది!


అలాగే – ముక్కూ మొహం తెలీని ఆడదైతే నీచం కానిది, ప్రాణ స్నేహితుడి, భార్య అని తెలియగానే అకృత్యమైంది.

ఒకే విషయం చూసే కోణాన్నిబట్టి స్వరూప స్వభావాలు మారిపోతున్నాయ్!

నైతిక విలువలన్నీ పరాయి మనుషుల దగ్గర కూలిపోతున్నాయ్! నీతి ఎక్కడ ఉన్నా ఒకటేకదా! మనిషిని బట్టి దానివిలువ మారుతుందా? ఛ... నా ఆలోచన తప్పు... ఈ తప్పుని జీవితాంతం వీపున కట్టుకుని మోయక తప్పదా?

తప్పదు... తప్పు జరగడానికి మూల కారణమైన తనకి మాత్రం ఈ బాధే సరైన శిక్ష!

✻




రచయిత సెల్ నెం: 92464 37710